క్లుప్తంగా

నేడు ప్రజాప్రతినిధులతో సమావేశం

మద్దూరు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నర్సింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిమిత్తం ఇటీవల అన్ని గ్రామ పంచాయతీల్లో వార్డులవారిగా డ్రాఫ్ట్ ఓటరు లిస్టు ప్రచురించడం జరిగిందన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అన్ని పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు విధిగా హాజరుకోవాలని కోరారు.

కృష్ణా: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10:గంటలకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జానయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అన్ని పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు విధిగా హాజరుకావాలన్నారు.

పీఆర్టీయూటీఎస్ మండల కార్యవర్గం ఎన్నిక

మాగనూర్: పీఆర్టీయూటీఎస్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి బుధవారం తెలిపారు. మండల అధ్యక్షుడిగా బలరాం, ప్రధాన కార్యదర్శిగా తిమ్మన్న, గౌరవ అధ్యక్షుడిగా శ్రీనివాసులు, అసోసియేషన్ అధ్యక్షుడిగా పి. శ్రీనివాసులు, మండల కార్యదర్శిగా వినోద్, ఉపాధ్యక్షుడిగా డెవిన్, మహిళా ఉపాధ్యక్షురాలిగా దీప ఎన్నికయ్యారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని నూతన కార్యవర్గ సభ్యులు సన్మానించారు. నాయకులు తిరుపతి, డి. శేఖర్, గురురాజరావు, శంకరచారి, పురుషోత్తంబాబు, శ్రీనివాసులు, గోవర్ధన్, డేవిన్, ఉస్సేన్, వంశీకృష్ణ, రాజు, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మాగనూర్: ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీపీఎం రాంనాయక్ అన్నారు. ఈ సందర్భంగా మహిళ సమైఖ్య భవనంలో మహిళా సమైఖ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీపీఎం రాంనాయక్ మాట్లాడుతూ.. బ్యాంకుల ద్వారా స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించి జీవనోపాధి పొంది అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మహిళ సమఖ్య అధ్యక్షురాలిగా తిరుపతమ్మ, ఆశ్విని, ఉపాధ్యక్షురాలిగా లక్ష్మి, కార్యదర్శులుగా మల్లమ్మ, గులాబీ, కో-శాధికారులుగా వెంకటమ్మ, స్నేహ, సహాయ కార్యదర్శిగా ఆశాభి, భవానిని ఎన్నుకున్నట్లు ఏపీఎం వనితకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రహ్మతుద్దీన్, ఏపీఎం వనితకూమార్, ఏపీజీవీబీ మేనేజర్ జగదీష్, సీసీ గంగాధర్, చిన్న కుర్మన్న, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

మైక్‌సెట్ వితరణ



ఆత్మకూర్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 1982–83 విద్యా సంవత్సరంలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థినులు బుధవారం సమావేశమయ్యారు. స్థానిక బాలికల పాఠశాలలో 42 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా రూ. 50 వేలు పోగు చేసి పాఠశాలకు డిజిటల్ మైక్రోస్కోప్, ఆంప్లిఫ్లేయర్, మైక్‌సెట్‌ను బహూకరించారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌సింగ్, జీహెచ్‌ఎం బాలరాజు, రియాజుద్దీన్, విజయభాస్కర్‌రెడ్డి, పూర్వవిద్యార్థులు అనురాధ, అనిత, గీతారాణి, నిర్మల, ఖమర్‌సుల్తాన, రేణుక, ఖమరున్నీసా, తారాదేవి, తిరుపతమ్మ, ఉత్తుబాయి, విజయలక్ష్మి, వెంకటరమణకుమారి, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

మేదరులను ఆదుకోవాలి

ఆత్మకూర్: మేదరులను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని మేదరి మహేంద్రసంఘం నాయకులు బుధవారం తహసీల్దార్ రాజు, కమిషనర్ నాగరాజుకు వేర్వేరుగా వినతి పత్రం అందజేశారు. ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా మేదరులు ఆత్మకూర్‌లో సమావేశమయ్యారు. మేదరులకు రుణాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. శ్రీనివాసులు, తోటరవి, నాగేష్, నారాయణ, కృష్ణయ్య, కాంతు, మహేష్, నరేందర్, ఉన్నారు.





అన్న ప్రసాద కార్యక్రమం చేపడుతున్న నర్సింహగౌడ్



ఆలయ మండపం వద్ద పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

గంగమ్మ ఒడికి గణపయ్య

మక్తల్: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని మక్తల్ పట్టణంలో భక్తులచే అశేష పూజలు అందుకున్న గణనాథుడు బుధవారం గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై గణనాథుడి శోభాయాత్ర నిర్వహించారు. చిన్నారులు, యువత నృత్యాలతో సందడి చేశారు. మహిళలు కోలాటాలు, బొడ్డెమ్మ ఆడారు. అనంతరం పట్టణ శివారులోని మక్తల్ పెద్ద చెరువులో వినాయక ప్రతిమలను నిమజ్జనంచేశారు. అంతకుముందు ఎస్పీ గౌతమ్ యోగేష్ మంగళవారం తెల్లవారు జామున నూర్ మజీద్, గాంధీ చౌక్, అజాద్‌నగర్, రాంలీలా మైదానం, జామియా మజీదు తదితర ప్రధాన కేంద్రాలను తనిఖీ చేశారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. పట్టణంలోని కొనసాగిన నిమజ్జన ఉత్సవాలకు గణేష్ శోబాయాత్రను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, చైర్‌పర్సన్ పావనీ, మున్సిపల్ కమిషనర్ బోగేశ్వర్ హాజరై తిలకించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, రాష్ట్ర బీజేపీ నాయకుడు కొండయ్య, రాజుల ఆశిరెడ్డి, వీహెచ్‌పీ నాయకులు భీంరెడ్డి, సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేష్, నాగప్ప, మల్లికార్జున్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ పంచాయతీలోని వినాయక నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం వివిధ రంగాలకు చెందిన కళాకారుల నృత్యాలు, ఆటపాటల ద్వారా ప్రజలను ఆకట్టుకున్నారు. అంతకుముందు మండపంలో నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ యువకులు, మహిళలు, ప్రముఖులు పాల్గొన్నారు.



మక్తల్‌లో శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న యువకులు

ఊట్కూరు: మండలంలోని పులిమామిడిలో బుధవారం శాంతియుతంగా వినాయక నిమజ్జనం నిర్వహించారు. గ్రామంలోని ఆలయాల్లో, ప్రధాన కూడలిలలో వినాయకులను ప్రతిష్ఠించి 11రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ శివారులోని చెరువులో వినాయకులను నిమజ్జనం చేశారు. ఈ మేరకు.. ఎస్ఐ కృష్ణంరాజును వినాయక కమిటీవారు సన్మానించారు. సూర్యయ్యగౌడ్, వైస్ ఎంపీపీ ఎల్లగౌడ్, నాయకులు రాంరెడ్డి, శ్రీనివాస్, శంకరన్న, వెంకటేష్, చెన్నకేశవులు, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చెరువులో నిమజ్జనం చేస్తున్న దృశ్యం



మక్తల్‌లో..



గుడెబల్లూర్‌లో..



నిమజ్జనం సందర్భంగా స్వీట్లు అందిస్తున్న పోలీసులు

భవన నిర్మాణ కార్మికుల ధర్నా



మాట్లాడుతున్న అంతన్‌గారి బాల్‌రాం

నారాయణపేట: భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర జేఏసీ పలుపు మేరకు తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి జిల్లా అధ్యక్షుడు అంతన్‌గారి బాల్‌రాం బుధవారం జిల్లా కేంద్రంలోని మున్సిపాల్‌పార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో పలువురు నాయకులు సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం, ఇఫ్టూ జిల్లా కార్యదర్శి బి. నర్సింహ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొండన్న పాల్గొని మాట్లాడారు.. కార్మికులకు ప్రమాద, సహజ మరణాలకు ఇచ్చే ఇన్సూరెన్స్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఓపెన్ టెండర్ సిస్టంను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డులో ఉన్న నిధిని కార్మికులకు ఖర్చు చేయాలన్నారు. కార్మికులకు ఇచ్చే బెనిఫిట్స్ పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల ఉప తహసీల్దార్‌కు, లేబర్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ తిలక్‌కు అందజేశారు. ఈ ధర్నాలో కార్మిక సంఘం నాయకులు నర్సింహ, చెన్నప్ప, కనకరాయుడు, బాలప్ప పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి



నారాయణపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడో తరగతి వరకు పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెడుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, ఈ నిర్ణయంతో ఐసీడీఎస్ నిర్వీర్యం అయ్యే అవకాశం ఉందని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శశికళ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి వివిధ డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, పునరాలోచన చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జోషి, నాయకులు సులోచన, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సులతో జీవనోపాధి

కోస్గి: విద్యార్థులు ఒకేషనల్ కోర్సులు చదవడంతో స్వయంగా జీవనోపాధి పొందొచ్చునని స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఒకేషనల్ ట్రైనర్ ప్రశాంతి సూచించారు. ఈ మేరకు బుధవారం ఒకేషనల్ కోర్సులో భాగంగా విద్యార్థులకు హకీంపేట గ్రామంలోని గ్రామీణ వికాస్ బ్యాంక్‌ను ప్రత్యేక్షంగా పరీక్షించి అవగాహన కల్పించారు. బ్యాంకుల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాలు, బ్యాంకు ఖాతాల నిర్వాహణ, ఇతర సేవలను బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు. నగదు జమ, విత్‌డ్రా, ఇతర లావాదేవీలను క్యాషియర్ సరిత వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రవిప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రామీణ బ్యాంకు వద్ద ట్రైనర్‌తోపాటు విద్యార్థులు

అల్పాహారం పంపిణీ



నారాయణపేట రూరల్: పట్టణంలోని చిల్డ్రన్స్ ఆస్పత్రి వద్ద బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ మేరకు.. మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణ్ బట్టడ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. అంతకుముందు సాయి హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. ప్రముఖ స్త్రీవైద్య నిపుణురాలు ప్రీతిరెడ్డి, మూగన్ జనార్ధన్, ఆత్మరాం ఏడీకే, రవిగౌడ్, కన్న జగదీష్, వెంకటయ్య, బాలాజీ పాల్గొన్నారు.

మండలస్థాయి క్రీడా పోటీలు

మాగనూర్: మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు ఈ నెల 21న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ రాకేష్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు.. 17సంవత్సరాలలోపు బాల, బాలికలకు కబడ్డీ, ఖోఖో వాలీ బాల్ పోటీలు, సెలక్షన్స్ ఉంటాయన్నారు. అథ్లెటిక్స్ 8–17 సంవత్సరాలోపు బాల, బాలికలకు 100మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్ ఇవెంట్స్ నిర్వహించబడుతుందన్నారు. ఈ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు, క్రీడాపోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ పోటీలో పాల్గొనే విద్యార్థులు తప్పకుండా పాఠశాల బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్ వెంట తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పీడీ రాకేష్, రేణుక, పీఈటీ శ్రీవాణి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ రాకేష్

ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుద్ధ్య చర్యలు

మద్దూరు: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి మండలంలోని అన్ని ప్రభుత్వ భవనాల్లో గ్రామ పంచాయతీ సిబ్బందిచే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ప్రజలకు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ నర్సింహారెడ్డి ప్రజలకు సూచించారు. 15రోజులపాటు గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజలు పాలు పంచుకోవాలని సూచించారు. అలాగే మండలంలోని పర్సపూర్ గ్రామాల్లో ఉపాధిపనులను ఎంపీఓ రామన్న, ఏపీఓ సిద్దేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. నిబంధల మేరకు ఉపాధి పనులు చేయాలని సిబ్బందికి ఆదేశించారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతివ్వండి

ఆత్మకూర్: కబడ్డీ క్రీడాకారులకు స్థలాన్ని దానంగా ఇచ్చిన దాతల విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని క్రీడాకారులు బుధవారం తహసీల్దార్ రాజుకి వినతిపత్రం అందజేశారు. మండలంలోని మూలమళ్లలో కబడ్డీ క్రీడాకారుల సౌకర్యార్థం గ్రామంలోని సంత స్థలాన్ని దేశాయి పద్మారెడ్డి వితరణగా అందించారు. ఈసందర్భంగా అక్టోబర్ 20వ తేదీన దాత తల్లిదండ్రుల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈసందర్భంగా తహసీల్దార్ రాజు విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నట్లు ప్రకటించారు. కబడ్డీ క్రీడాకారులు అశోక్, శ్రీను, వెంకట్రాములు, ఎల్లన్న, సత్యం తదితరులు ఉన్నారు.

వైద్యశిబిరం కరపత్రాల విడుదల

నారాయణపేట రూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ యశోద కేర్ ఆస్పత్రిలో ఈనెల 20న నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరం కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా లయన్ సభ్యులు మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళ, యువతుల ఆరోగ్య సమస్యలలపై నిర్వహించే ఉచిత శిబిరాన్ని మహిళలు యువతులు సద్వినియోగం చేసువాలన్నారు. ఆరోగ్య సమస్యలు ఎండోమెట్రోసిస్ సంబంధిత వ్యాధులకు ఉచిత చికిత్సతోపాటు ల్యాబ్ పరీక్షలు స్కానింగ్ చేసి ఉచితంగా మందులను పంపిణీ చేస్తామని తెలిపారు. సభ్యులు హరిణారాయణ్, ప్రీతి, జనార్ధన్, రవి గౌడ్, బాలాజీ, కృష్ణ మూర్తి, సిబ్బంది సురేష్, వెంకటేష్, విమల పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న సభ్యులు

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

నర్వ: బదిలీపై వెళ్తున్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ మేరకు.. పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల నుంచి పదోన్నతిపై బదిలీ అయిన మల్లేష్, లక్ష్మణ్‌లను శాలువాతో సత్కరించారు. అనంతరం పాఠశాలకు ఉపాధ్యాయులు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వేణుగోపాల్‌రెడ్డి, పీఆర్టీయూ అధ్యక్షుడు వెంకటేష్, ఉస్మాన్, మాజీ సర్పంచు సంధ్య, ఆంజనేయులు, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ అయ్యన్న, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ మంజుల పాల్గొన్నారు.



ఓటరుగా నమోదు చేసుకోవాలి

కోస్గి: ప్రజాస్వామ్యంలో 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని, ఓటుహక్కు వజ్రాయుధం లాంటిదని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలో కొనసాగుతున్న ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమంలో భాగంగా పోలింగ్ బూత్‌ల వారిగా ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులను పరిశీలించారు. ఆయా పోలింగ్ బూత్‌లను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల పోలింగ్ బూత్‌లను పరిశీలించి గ్రామాల్లో అర్హులను ఓటర్లుగా నమోదు చేసే బాధ్యత బీఎల్‌ఓలదేనన్నారు. అర్హులైన యువతి, యువకులు సైతం తమ పేర్లు స్వచ్ఛందంగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుభాష్‌రెడ్డి, బుగ్యాసాబ్, హన్మంతుతోపాటు ఆయా పోలింగ్ బూత్‌ల అధికారులు పాల్గొన్నారు.



వివరాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

వాల్‌పోస్టర్ విడుదల

ఊట్కూరు: మండలంలోని బిజ్వార్‌లో బుధవారం పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభవాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ మేరకు.. పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు గోపి మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు పీడీఎస్‌యూ సంఘం ఆవిర్భవించిందన్నారు. ఈ నెల 30న ఉస్మానియా యూనివర్సిటీలో స్వర్ణోత్సవ సభను ఏర్పాటుచేయడం జరిగిందని, విద్యార్థులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. నాయకులు భాస్కర్, రాము, రవీదర్‌రెడ్డి, మల్లేష్, తిరుమలేష్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

మహాలక్ష్మి పథకం మహిళలకు వరం

నర్వ: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు సబ్సిడీపై అందించే మహాలక్ష్మి పథకం మహిళలకు వరమని నాయకులు అన్నారు. బుధవారం సాయంత్రం పెద్ద కడ్మూర్ పంచాయతీ కార్యాలయం వద్ద మహిళలకు మహాలక్ష్మి పథకం మంజరు పత్రాలను నాయకులు లబ్ధిదారులకు అందించారు. గ్రామంలో దాదాపు 200మంది లబ్ధిదారులకు ఈ ప్రొసీడింగ్స్‌ను అందించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామంజనేయులు, కాంగ్రెస్ నాయకులు భాస్కర్‌గౌడ్, సాతర్ల సత్యన్న, టి.రాములు, లక్ష్మణ్, పంచాయతీ సిబ్బంది పాష పాల్గొన్నారు.



మంజూరు పత్రాలను అందిస్తున్న నాయకులు

దాడులను అరికట్టాలి..

నారాయణపేట: జిల్లా దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, కుల వివక్ష చూపుతున్న వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ యోగేష్ గౌతమ్‌ను బుధవారం ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ కలిసి విన్నవించారు. పలు గ్రామాల్లో దళితుల భూములు ఆక్రమించుకుంటున్నారని, అడగడానికి వెళ్తే వారిపై దాడులు చేస్తున్నారని తెలిపారు. ప్రతి నెల 30న కుల వివక్ష ఉన్న గ్రామ, మండల, నియోజకవర్గంలో సివిల్ రైట్ డే (పౌర హక్కుల దినోత్సవం) ఏర్పాటు చేసి, దళితులను ఆలయప్రవేశం చేయించి, గ్రామాల్లో సహపంక్తి భోజనాలు చేయాలని కోరారు. అనంతరం ఎస్పీకి శాలువాతో సన్మానించారు. ఎస్పీని కలిసిన వారిలో ఆ సంఘం నాయకులు రావుల కృష్ణ, రత్నం, భాస్కర్ తదితరులు ఉన్నారు.



ఎస్పీని సన్మానిస్తున్న మల్లెపోగు శ్రీనివాస్

నాణ్యమైన భోజనం అందించాలి

మాగనూర్: విధులో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ రహ్మతుద్దీన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఓబ్లాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని, అంగన్‌వాడీ చుట్టూ పరిసరాల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని నర్సరీ, ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు రాకుండా పంచాయతీ సిబ్బంది పనిచేసేలా పంచాయతీ కార్యదర్శి చూసుకోవాలని సూచించారు. గ్రామంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రహ్మతుద్దీన్

అవినీతి అధికారిపై విచారణ చేపట్టాలి

నారాయణపేట: కలెక్టర్ కార్యాలయంలోని అవినీతి అధికారిపై తక్షణమే విచారణ జరపాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బొదిగెలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ ధరణి సమస్యలు పరిష్కారం కావాలంటే కలెక్టర్ కార్యాలయంలో ఒక రెవెన్యూ ఉన్నతాధికారికి ముడుపులు ముడుతున్నాయని ఆరోపించారు. ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులే అక్రమాలకు, అవినీతికి పాల్పడితే పేదలకు ఏట్లా జరుగుతుందని ప్రశ్నించారు. అధికారి తీరు మారకుంటే తగిన ఆధారాలు బయట పెడతానని హెచ్చరించారు. తక్షణమే కలెక్టర్‌పై విషయంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పేట అసెంబ్లీ అధ్యక్షుడు హన్మంతు, సోషల్ మీడియా ఇన్‌చార్జి అశోక్, బీఎస్పీ నాయకులు తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొదిగెలి శ్రీనివాస్

పనివేళలను సవరించాలి

నారాయణపేట రూరల్ : గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల పని వేళల్లో శాస్త్రీయతను కొనసాగించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ డిమాండ్ చేశారు. మండలంలోని సింగారం క్రాస్ రోడ్ వద్ద నిర్వహిస్తున్న దామరగిద్ద సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బుధవారం భోజన విరామ సమయంలో ఆ సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని గురుకుల సొసైటీలో ఒకే పని వేళలను నిర్ణయిస్తూ జీఓ నంబర్ 16తో ఉత్తర్వులు ఇచ్చారని, ఈ టైం టేబుల్ శాస్త్రీయంగా లేదని, విద్యార్థులపైన ఒత్తిడి పెంచేదిగా ఉన్నదని విమర్శించారు. వెంటనే టైం టేబుల్ ను సవరించాలని, ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రవికుమార్, హెచ్‌ఎంలు శ్రీనివాసులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు